సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం ; 17 ; ఫిబ్రవరి ; 2025



దొంగలొస్తున్నారు..
వారం రోజులుగా పాల్వంచ పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ప్రజలు వణికిపోతున్నారు. 8లో



ఇక సౌర వెలుగులు..
ఉమ్మడి జిల్లాలో పీఎం–కుసుమ్ పథకం కింద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు టీఎస్ రెడ్‌కో దరఖాస్తులు స్వీకరిస్తోంది. 8లో



వాతావరణం
జిల్లాలో సోమవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాకినాడ టు భద్రాచలం
కాలినడకన తరలివచ్చిన రామభక్తులు



కీర్తనలు ఆలపిస్తున్న రామభక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు ఏపీ నుంచి 300 మంది భక్తులు ఆదివారం తరలివచ్చారు. ఏపీలోని కాకినాడ నుంచి కాలినడకన భద్రాచలం రామాలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బేడా మండపంలో రామ కీర్తనలు ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు.

శ్రీకనకదుర్గ అమ్మవారికి విశేష పూజలు



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరపగా, భక్తులు అన్నప్రాశనలు, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి
సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు గిరిజన దర్బార్
భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నేడు నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలు వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు మరో అవకాశం
కొత్తగూడెంఅర్బన్: ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాని ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు డీఐఈఓ హెచ్.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ నెల 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఫీజు చెల్లించి వివిధ కారణాలతో హాజరు కాని విద్యార్థులకు ఈ నెల 18వ నుంచి 22వ తేదీ వరకు మళ్లీ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఇచ్చిందని వివరించారు. చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని, వివరాలకు ప్రిన్సిపాల్ కత్తి రమేష్‌ను 96769 81266 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

కరకట్టకు బ్రిడ్జి బ్రేక్!

నిలిచిన గోదావరి కరకట్ట పొడిగింపు నిర్మాణ పనులు
- జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యం
- భారీగా పెరగనున్న నిర్మాణ అంచనా వ్యయం
- ఈ ఏడాది జూన్ నాటికీ పనులు పూర్తి కష్టమే



జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం

భద్రాచలం: భద్రాచలంలో కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్ట పొడిగింపు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇరిగేషన్, జాతీయ రహదారుల శాఖల మధ్య సమన్వయ లోపం, డిజైన్ల మార్పుతో పనులు వేగవంతంగా సాగడంలేదు. ఫలితంగా వచ్చే వర్షాకాలంలో కూడా సుభాష్ నగర్, సీఆర్‌పీఎఫ్ క్యాంపు పరిసర ప్రాంతాలాలకు గోదావరి వరద ముప్పు తప్పేలా లేదు.

రూ.38 కోట్లతో కట్ట పొడిగింపు
గోదావరి వరద నుంచి భద్రాచలంలోని ముంపు కాలనీల ప్రజలను రక్షించేందుకు తీరం వెంబడి 2000లో సుమారు 7.5 కిలోమీటర్ల పొడవునా 10 నుంచి 15 మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించారు. కూనవరం రోడ్డులో సరస్వతి శిశు మందిర్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉండటంతో అక్కడ రోడ్డుకు ఇరువైపులా 700 మీటర్ల దూరం కరకట్ట పనులు ఆగిపోయాయి. అనంతరం ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ముందడుగు పడలేదు. మూడేళ్ల నుంచి గోదావరికి భారీ వరదలు రావడంతో కూనవరం రోడ్డు వైపు ఉన్న కాలనీలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. పలుమార్లు విన్నవించాక అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ ముందు 700 మీటర్ల కరకట్ట నిర్మాణానికి రూ. 38 కోట్లు విడుదల చేసింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పనులు కొనసాగాయి.

ఎన్‌హెచ్‌పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణమే పెద్ద సమస్య?
11 మీటర్ల ఎత్తుతో సాగుతున్న కరకట్ట పొడిగింపు పనులు గత జూన్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుమార్లు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై సరస్వతి శిశు మందిర్‌వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉండటంతో నెల రోజుల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పనులను ఇరిగేషన్ శాఖ పర్యవేక్షిస్తుండగా, ఓవర్ బ్రిడ్జి, ఇరువైపులా అప్రోచ్ రోడ్, రిటైనింగ్ వాల్ నిర్మాణాలు పటిష్టంగా చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ సూచించింది. ఈ క్రమంలో రెండు శాఖల మధ్య డిజైన్ల మార్పులపై సంప్రదింపులు, సర్వేలు సాగుతూనే ఉన్నాయి. ఇటీవల ఎన్‌హెచ్ అధికారులు ప్రాథమికంగా అనుమతి ఇవ్వగా, బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో మట్టి శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ఆ మట్టి సాంద్రత నివేదిక వచ్చాకే బేస్‌మెంట్, కరకట్ట ఎత్తు నిర్ధారించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నివేదిక వచ్చాకే...
బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో మట్టి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపాం. ఆ రిపోర్టులు అందాల్సి ఉంది. నిర్మాణ డిజైన్, బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచాం. గోదావరి వరదల నుంచి దిగువ ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ ఉండేలా పనులు చేపడతాం. ప్రభుత్వం నుంచి ఇతర అనుమతులు రాగానే పనులు తిరిగి ప్రారంభమవుతాయి.
– రాంప్రసాద్, ఈఈ, ఇరిగేషన్ శాఖ భద్రాచలం

వచ్చే వర్షాకాలంలోనూ తప్పని వరద ముప్పు
ఇటీవల కొత్తగూడెం అవతల వేపలగడ్డ గ్రామం వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి తరహాలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం ఉండాలని జాతీయ రహదారుల శాఖ సూచించినట్లు తెలిసింది. ఆ ప్రకారం అప్రోచ్ రోడ్లు, బ్రిడ్జి, బైపాస్ రోడ్ నిర్మాణాలకు బడ్జెట్ భారీగా పెరిగే అవకాశం ఉంది. కరకట్ట పొడిగింపునకు ప్రభుత్వం కేటాయించిన రూ. 38 కోట్లకు వ్యయం మూడు, నాలుగింతలయ్యే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ఆడిటింగ్, రాష్ట్ర కమిటీ విజిట్ సర్వేలు, ఇతర పనులు పూర్తయితే తప్ప ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభంకావు. ఈ నేపథ్యంలో రానున్న వర్షాకాలం సీజన్ నాటికీ కరకట్ట పూర్తయ్యే పరిస్థితి కనిపించటం లేదు. దిగువ ప్రాంత కాలనీ వాసులు మళ్లీ గోదావరి వరద ముంపు భయంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని వేడుకుంటున్నారు.

గోదావరి జలాలతో సస్యశ్యామలం..



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- బీడు భూములకు సాగునీరు అందిస్తాం
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బూర్గంపాడు: ఉమ్మడి జిల్లాలోని బీడు భూములను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తున్నానని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుత తెలిపారు. తాళ్లూరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పంచాక్షరయ్య 93వ జన్మదినం సందర్భంగా ఆదివారం ఇరవెండిలో నిర్వహించిన నవ నవతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నలభై ఏళ్లుగా నిబద్ధతతో రాజకీయాలు చేస్తున్నానని, సగర్వంగా చెప్పుకునేలా ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి కొనసాగిస్తున్నానని వివరించారు. భద్రాద్రి రామయ్య చెంతకు రైలు మార్గాన్ని, విమాన సౌకర్యం కల్పించటమే తన లక్ష్యమని చెప్పారు. తాళ్లూరి పంచాక్షరయ్య నిబద్ధతను ఆదర్శంగా తీసుకున్నానని తెలిపారు. అనంతరం 101 మంది కవులను, కళాకారులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధు, మండలి బుద్ధప్రసాద్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి గోపాలకృష్ణ, చిగురమళ్ల శ్రీనివాస్, తాళ్లూరి బాబూరావు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, తాళ్లూరి రాజా శ్రీకృష్ణ, డాక్టర్ గొట్టిపాటి ప్రవీణ్‌కుమార్, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా పులిగుండాల
దమ్మపేట: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్ట్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తమ పదవీ కాలం పొడిగింపుపై హర్షం వ్యక్తం చేస్తూ పలువురు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు ఆదివారం గండుగులపల్లిలోని మంత్రి నివాసంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేంసూరు మండలంలోని కల్లూరుగూడెంలో ఏడాదిలోగా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తామన్నారు. సత్తుపల్లి మండలం కిష్టారం పరిధిలోని అంబేడ్కర్, బీసీ కాలనీల ప్రజలు సింగరేణి బంకర్‌తో ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అంతకుముందు వేకువజామునే మల్లారంలోని తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కాసాని నాగప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, ఎర్రా వసంతరావు, తుమ్మల శేషుబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.5 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న కమటం వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయానికి ఎన్ఆర్ఐ జాలె సుధాకర్‌రెడ్డి ఆదివారం రూ.5 లక్షల విరాళం అందజేశారు. మార్చి 9న ఇక్కడ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నారు. గతంలో తన తండ్రి జాలె నరసింహారెడ్డి జ్ఞాపకార్థం సోదరుడు దయాకర్‌రెడ్డితో కలిసి ఆలయ ధ్వజస్తంభం, నవగ్రహాల ఏర్పాటుకు రూ.5 లక్షలు సమకూర్చారు. ఆలయం నిర్మాణ ఖర్చు భారీగా పెరగడంతో మరో రూ.5 లక్షలు అందజేశారు. గ్రామపెద్ద, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, సుగుణ దంపతులు తమ కుటుంబసభ్యులతో కలిసి రూ.1,51,116 విరాళం అందజేశారు.

‘మధ్యాహ్న భోజనం’ మెరుగుకు కసరత్తు



మధ్యాహ్న భోజన పథకం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: మరింత మెరుగ్గా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగైన రీతిలో అమలు చేసేందుకు ప్రభుత్వం నివేదికలు కోరింది. దీంతో ఆదివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కొత్తగూడెం ఎంఈఓ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. అమలు తీరు, రోజువారీ హాజరు, నివేదికల సమర్పణ, బిల్లుల తయారీ, చెల్లింపు తదితర అంశాలపై డీఈఓ వెంకటేశ్వరాచారి, కొత్తగూడెం ఎంఈఓ ప్రభు దయాల్, ఫైనాన్స్ అధికారి శ్రీనివాసరావులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉన్న లోపాలను అధిగమించేలా ప్రణాళిక రూపొందించేందుకు కూలంకషంగా చర్చించారు. కలెక్టర్ మరింత సమర్థవంతంగా మధ్యాహ్న భోజన పథకం అమలు అయ్యేలా ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డీజిల్‌కూ డబ్బుల్లేవ్

- గ్రామాల్లో తిరగలేకపోతున్న చెత్త సేకరణ ట్రాక్టర్లు
- నిధుల్లేక కుంటుపడుతున్న పంచాయతీలు
- నిర్వహణ భారమంతా కార్యదర్శులపైనే..
- ఏడాది పూర్తి చేసుకున్న ప్రత్యేకాధికారుల పాలన



చెత్త సేకరిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

బూర్గంపాడు: నిధుల్లేక గ్రామపంచాయతీలు నీరసిస్తున్నాయి. చెత్త సేకరణ ట్రాక్టర్లకు డీజిల్ కొనే పరిస్థితి కూడా లేదు. కొన్ని గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్ ఫైనాన్స్ కిస్తీలు నెలల తరబడి బకాయి ఉన్నాయి. బ్యాంకర్ల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవటంతో గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్పు చేసి, సొంత ఖర్చులతో పంచాయతీల్లో పనులు జరిపిస్తున్నారు.

బిల్లులూ పెండింగ్‌లోనే..
జిల్లాలో 481 గ్రామపంచాయతీలున్నాయి. ఏడాది కాలంగా పాలవర్గాలు లేకపోవటంతో గ్రామాల్లో పాలన గాడితప్పింది. చెత్త ట్రాక్టర్ల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి పథకాల పైప్‌లైన్లు, ట్యాప్‌ల మరమ్మతులు, బ్లీచింగ్ కొనుగోలు, డ్రెయినేజీల పూడికతీత, దోమల నివారణ చర్యలు, నర్సరీలు, డంపింగ్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ వంటి పనులకు నిధుల కొరత ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు 15వ ఆర్థికసంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల చేస్తేనే వీటి నిర్వహణ అంతంత మాత్రంగా జరుగుతుంది. ఏడాది కాలంగా నిధులు రాకపోవడంతో నిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శులపైనే పడింది. గత పాలకవర్గాల హయాంలో చేపట్టిన పనులకు కూడా రూ. లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు, కాంట్రాక్టర్లు పంచాయతీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. ఒకట్రెండు సార్లు కొద్దిమేరా ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అవి ట్రెజరీలోనే నిలిచిపోతున్నాయి.

అప్పులు చేస్తున్న కార్యదర్శులు
గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకు ఏడాది ముగిసింది. గతేడాది ఫిబ్రవరి 1న అన్ని గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి తెచ్చింది. ప్రతీ గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించినా పూర్తిస్థాయి బాధ్యతలు గ్రామపంచాయతీ కార్యదర్శులపైనే పడింది. గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు నిలిచిపోయాయి. పాలనపరంగా, ఆర్థికంగా పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ పనుల నిర్వహణ కటకటగా మారింది. కొందరు కార్యదర్శులు చేతినుంచి డబ్బులు ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారు. ఇంటి పన్ను వసూళ్లు, సంతల నిర్వహణతో వస్తున్న ఆదాయం గ్రామ పంచాయతీ నిర్వహణకు ఎటూ సరిపోవటం లేదు.

కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
చెత్త సేకరణకు ట్రాక్టర్ తిరగాలంటే డీజిల్, మెయింటెనెన్స్ ఖర్చుల కోసం పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తుంది. ఏ చిన్న పని చేయాలన్నా పంచాయతీ కార్యదర్శులు తమ జేబులో డబ్బులు పెట్టాల్సివస్తోంది. తమ వేతనం డబ్బులు పంచాయతీ పనులకు ఖర్చు చేస్తున్నామని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభల నిర్వహణకు కావాల్సిన టెంట్లు, కుర్చీలు, తాగునీరు కోసం కూడా నిధులు ఉండటం లేదని వాపోతున్నారు. నిధుల్లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పంచాయతీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. గ్రామపంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు కూడా సరిగా వేతనాలు అందటం లేదు. ఆందోళన చేపట్టడంతో ఇటీవల వారికి ప్రభుత్వం మూడునెలల వేతనాలను విడుదల చేసింది. ప్రభుత్వం స్పందించి పాలనకు అవసరమైన నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇంటి పన్ను ఆదాయం వినియోగించుకోవాలి
పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం లేదు. దీంతో పంచాయతీల్లో ఆర్థిక సమస్య ఉన్న మాట వాస్తవమే. ఇంటి పన్నుల వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజూవారీ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించాం.
–చంద్రమౌళి, డీపీఓ

ముగిసిన గేట్ పరీక్షలు
సుజాతనగర్: వేపలగడ్డ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న గేట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం జరిగిన పరీక్షకు ఉదయం సెషన్‌లో 129 మంది విద్యార్థులకు గానూ 115 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 130 మందికి గానూ 119 మంది హాజరయ్యారు.

కిన్నెరసానిలో సండే సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులు డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 474 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగ వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,695 లభించగా, 200మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.12,490 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

చికెన్ దుకాణాలు వెలవెల



వినియోగదారులు రాక వెలవెలబోతున్న రామవరంలోని చికెన్ షాపు



కొత్తగూడెం బాబూక్యాంపులో మటన్ షాపుల వద్ద సందడి



చేపలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- బర్డ్ ఫ్లూ ప్రభావంతో తగ్గిన కొనుగోళ్లు
- మటన్, చేపల దుకాణాల్లో గిరాకీ

చుంచుపల్లి/జూలూరుపాడు/పాల్వంచరూరల్: జిల్లావ్యాప్తంగా విక్రయాల్లేక ఆదివారం చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి. ఏపీలోని గోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ ఫారాల్లోని కోళ్లు బర్డ్ ఫ్లూ వ్యాధి బారినపడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో చికెన్ తినేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు, మండల కేంద్రాల్లోని చికెన్ దుకాణాల్లో వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ప్రతీ వారం మాంసం ప్రియులతో కిటకిటలాడేవని, ఆదివారం మాత్రం కస్టమర్లు ఇటువైపు కూడా చూడలేదని దుకాణాదారులు పేర్కొన్నారు. మరో వైపు మటన్, చేపల విక్రయాలకు గిరాకీ పెరిగింది. అమ్మకాలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు వాపోతున్నారు. కేజీ రూ.140కు తగ్గించినా ఎవరూ కొనడం లేదని పేర్కొన్నారు.

మటన్‌కు పెరిగిన ధర
బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ తినడానికి ధైర్యం చేయడంలేదు. కొన్ని రోజులపాటు చికెన్‌కు దూరంగా ఉంటేనే మంచిదనే భావనలో ఉన్నారు. బదులుగా చేపలు, మటన్, నాటు కోళ్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మటన్, చేపలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. గతంలో కేజీ మటన్ రూ.600 నుంచి రూ.800 వరకు విక్రయించగా ఆదివారం రూ.వెయ్యికి ఎగబాకింది. ఖమ్మం మధురానగర్‌లో కిలో రూ.1200కు విక్రయించినట్లు వినియోగదారులు తెలిపారు. గతంలో కేజీ చేపలు రూ. 130 నుంచి రూ. 150 వరకు విక్రయించగా, ఆదివారం రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయించారని వినియోగదారులు పేర్కొంటున్నారు. కాగా చికెన్ అమ్మకాలు తగ్గిపోవడంతో దుకాణాల వ్యాపారులు, వర్కర్లు, కోళ్ల ఫారాల నిర్వాహకులు, వర్కర్ల ఉపాధిపై ప్రభావం పడనుంది.

బర్డ్ ఫ్లూ విస్తరించకుండా చర్యలు
జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం అంతగాలేదని, విస్తరించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో బర్డ్ ఫ్లూ ఉన్నందున జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలం అల్లిపల్లి, చర్లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఆయా రాష్ట్రాల నుంచి జిల్లాకు ఫారం కోళ్లు, దాణా, గుడ్లు రాకుండా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. బర్డ్ ఫ్లూ ప్రభావం కారణంగా జిల్లాలోని 25 ఫారాల్లో నిర్వాహకులు కోళ్ల పెంపకాన్ని తగ్గించారని చెప్పారు.

క్లుప్తంగా

ప్రవేశ పరీక్ష ప్రశాంతం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ గిరిజన గురుకుల కళాశాలలో ఆదివారం నిర్వహించిన గిరిజన గురుకులాల సీఓఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని చీఫ్ సూపరిటెండెంట్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.వ్యవతి తెలిపారు. 395 మంది విద్యార్థులకు గాను 375 మంది హాజరయ్యారు. ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జున్‌రావు పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.

ఇసుక టిప్పర్లు సీజ్



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

దమ్మపేట: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి శివారులో ఆదివారం పోలీసులు తనిఖీలు చేపట్టగా ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను గుర్తించారు. అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు తేలడంతో టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

అనంతారం శివారులో ట్రాక్టర్..

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం శివారులోగల వాగు నుంచి అశ్వారావుపేట పట్టణానికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టణ శివారులో గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేయడంతోపాటు డ్రైవర్ సురేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ సెంటర్‌లోకి దూసుకొచ్చిన కారు



చికెన్ దుకాణంలోకి దూసుకొచ్చిన కారు

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ నెహ్రూనగర్‌లో ఆదివారం ఓ ఇంట్లోకి కారు వేగంగా దుసుకెళ్లింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు నుంచి కొత్తగూడెం వెళ్తున్న కారు నెహ్రూనగర్ వద్ద రోడ్డు దాటుతున్న బాలుడిని తప్పించబోయి నేరుగా రోడ్డు పక్కనే ఉన్న చికెన్ షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బాలుడు హృతిక్‌కు కాలు విరగగా చికెన్‌షాపు ముందు నిలిపి ఉంచిన రెండు బైక్‌లు, చికెన్‌షాప్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. బాలుడిని స్థానికులు మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చింతకానిలో బర్డ్‌ఫ్లూ కలకలం

మృత్యువాత పడుతున్న కోళ్లు



మృతి చెందిన కోళ్లు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోళ్ల ఫారంలోని వందలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న కోళ్ల ఫారంలలో పెంచుతున్న కోళ్లు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి రోజూ సుమారు 700 కోళ్లు మృతి చెందుతున్నాయని ఫారం నిర్వాహకులు ఉమ్మనేని లక్ష్మయ్య, అప్పన రమేశ్, సురేశ్ తెలిపారు. పశుసంవర్ధక శాఖాధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని వాపోయారు. బ్యాంక్‌లో రుణాలు తీసుకుని కోళ్ల ఫారంలను నిర్వహిస్తున్నామని, బర్డ్‌ఫ్లూ వైరస్‌తో ఫారంలోని కోళ్లు చనిపోతుండటంతో లక్షల్లో నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పశుసంవర్ధకశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించి వైరస్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని దంపతుల దుర్మరణం

మృతులు దుమ్ముగూడెం వాసులు

ఎటపాక (అల్లూరిజిల్లా): మండలంలోని నవోదయ పాఠశాల సమీపంలో జామాయిల్ కర్రలోడు ట్రాక్టర్ ఢీకొని దంపతులు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కన్నపరాజు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని మారాయిగూడెం పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన సోయం రాంబాబు(45), ముత్యాలమ్మ (40) ద్విచక్రవాహనంపై భద్రాచలం వచ్చారు. పని ముగించుకుని ఎటపాక మండలం బొజ్జిగుప్ప గ్రామం మీదుగా స్వగ్రామానికి వస్తున్నారు. జామాయిల్ కర్రలోడుతో ట్రాక్టర్ భద్రాచలం వస్తోంది. సింగిల్‌రోడ్డు కావడంతో వారు నవోదయ పాఠశాల సమీపంలో ట్రాక్టర్‌ను దాటి వెళ్లే క్రమంలో కర్ర ద్విచక్రవాహనానికి తగలడంతో దంపతులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలొస్తున్నారు..

- హడలిపోతున్న పాల్వంచ ప్రజలు
- రాత్రయితే చాలు చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర ప్రాంతాల వ్యక్తుల సంచారం అధికం



కాంట్రాక్టర్స్‌కాలనీలో చోరీకి యత్నించిన ఇంటి ఎదుట స్థానికులు

పాల్వంచ: వారం రోజులుగా పాల్వంచ పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ప్రజలు వణికిపోతున్నారు. రాత్రి అయితే చాలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి, లోపలికి చొరబడి చోరీలకు పాల్పడుతున్నారు. పది రోజుల వ్యవధిలో అనేక చోట్ల చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. దొంగల స్వైరవిహారంతో పలు ఏరియాల్లో ప్రజలకు కంటిమీద కునుకు ఉండటం లేదు. గత జనవరి 26వ తేదీన నవభారత్ కాలనీలో దొంగలు బీభత్సం సృష్టించారు. దొంగల ముఠా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఏకకాలంలో చోరీలకు పాల్పడ్డారు. నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేయగా, మొత్తం సొత్తు రూ.కోటి వరకు స్వాహా చేసినట్లు అంచానా వేస్తున్నారు. ఈ చోరీ ఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. చోరీ జరిగిన ప్రదేశాల్లో క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా పాల్గొన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగలను పట్టుకునేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో పలు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ అధికంగా ఉంటారు. దీంతో దొంగలు ఎక్కడి వారనేది కూడా గుర్తించడం ఇబ్బందికరంగా మారుతోంది.

కాంట్రాక్టర్స్ కాలనీలో..

కాంట్రాక్టర్స్ కాలనీలో ఈ నెల 7న సుమారు ఏడెనిమిది ఇళ్లల్లో దొంగలు ఏక కాలంలో చోరీలకు యత్నించారు. ఇళ్ల తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీ చేసేందుకు యత్నించగా నగదు దొరకలేదు. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగలు సంచరించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. దీంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులు వ్యవధిలోనే దొంగలు 9వ తేదీ అర్ధరాత్రి కాంట్రాక్టర్స్ కాలనీలో ఇంటి తాళాలు పగులగొట్టారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో అర్ధరాత్రి వేళ పరిశీలించారు. వెంటనే ఇంటి ఓనర్‌కి ఫోన్ చేసి వివరాలు అడిగారు. తాను సాదీలో ఉన్నానని, ఇంట్లో విలువైన వస్తువులు లేవని చెప్పడంతో ఊపరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా సీతారాంపట్నంలో పలు ఇళ్లల్లోని పశువులు, ఆలయంలో నగదు, ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. ఇటీవల బస్టాండ్ వద్ద ఓ రిటైర్డ్ ఉద్యోగి మోటార్ సైకిల్‌లో ఉన్న సెల్‌ఫోన్, మున్సిపాలిటీ రోడ్డులో టీస్టాల్ వద్ద స్కూటీలోని బంగారు ఆభరణాలు, ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ బస్సు ఎక్కే క్రమంలో పర్సు చోరీకి పాల్పడ్డారు.



సీసీ కెమెరాకు చిక్కిన దుండగుడు

పెట్రోలింగ్ ముమ్మరం చేశాం..



పట్టణంలో ఇటీవల దొంగతనాలు జరుతున్న విషయంపై పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశాం. రాత్రి సమయాల్లో బ్లూకోల్ట్స్ సిబ్బందిని అదనంగా పెంచాం. అన్ని ఏరియాల్లో గస్తీ కాస్తున్నాం. నవభారత్ ఘటనపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సహకరించాలి. –సతీశ్, సీఐ, పాల్వంచ

పట్టపగలే చోరీకి యత్నం



రాహుల్‌గాంధీనగర్‌లో గడ్డపారను వదిలివెళ్లిన దుండగుడు

రాహుల్‌గాంధీనగర్‌లో గురువారం ఓ దొంగ పట్టపగలే చోరీకి యత్నించాడు. యాదాద్రిలోని టీజీజెన్‌కో ఫైర్‌స్టేషన్‌లో పని చేసే ఉద్యోగి రాహుల్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటికి తాళం వేసి వెళ్లగా ఓ దొంగ గడ్డపారతో పగలగొట్టే ప్రయత్నం చేయడంతో చుట్టుపక్కల వారు గమనించగా పరారయ్యాడు.

ఇక సౌర వెలుగులు..

- ఉమ్మడి జిల్లాలో 280 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు
- పీఎం కుసుమ్ పథకం కింద దరఖాస్తుల స్వీకరణ
- 15 మెగావాట్లకు అందిన తొమ్మిది అప్లికేషన్లు



ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో సౌర వెలుగులు నింపేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. పీఎం–కుసుమ్ పథకం కింద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, ఎస్‌హెచ్‌జీల నుంచి టీఎస్ రెడ్‌కో అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 280 మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా, ఇందులో 200 మెగావాట్ల ప్లాంట్లను రైతులు, రైతు సంఘాలు, డెవలపర్స్‌తో ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. మరో 80 మెగావాట్ల ప్లాంట్లను స్వయం సహాయక సంఘాలకు కేటాయించనున్నారు. ఇప్పటివరకు పీఎం కుసుమ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 15 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు తొమ్మిది దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. ఈనెల 22వ తేదీ వరకు అవకాశం ఉన్నందున ఈ సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.

సొంత భూముల్లో విద్యుదుత్పత్తి..

సొంత భూములు కలిగిన రైతులు, డెవలపర్లు, రైతు సంఘాలు, ఇతర సంస్థలు ఆసక్తి చూపితే వారితో 0.5 మెగావాట్ నుంచి 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించేందుకు చర్యలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో 100 మెగావాట్లు, భద్రాద్రి జిల్లాలో 100 మెగావాట్ల ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఒక మెగావాట్‌కు రూ.2.97 కోట్ల వ్యయం అవుతుందని రెడ్కో అంచనా వేసింది. ఇందులో ఎస్‌హెచ్‌జీలు 10 శాతం వాటా భరిస్తే, మిగిలిన 90 శాతాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. ప్లాంట్ల ఏర్పాటుకు ఎస్‌హెచ్‌జీలకు ప్రభుత్వ, అటవీ, దేవాదాయ భూములను ప్రభుత్వం లీజుకు ఇవ్వనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో అత్యుత్తమ పనితీరు కలిగిన సంఘాలను ఎంపిక చేస్తున్నారు. రైతులైతే 30 శాతం పెట్టుబడి పెడితే 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు 6 శాతం వడ్డీకే రూ.2 కోట్ల వరకు రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పైలట్ ప్రాజెక్ట్‌గా 31 గ్రామాలు

ప్లాంట్లతోపాటు పైలట్ ప్రాజెక్ట్ కింద 31 గ్రామాలను సోలార్ మోడల్ విలేజ్‌లుగా ఎంపిక చేశారు. వీటిలో ఖమ్మం జిల్లాలోని 27 గ్రామాలతోపాటు భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి, దురదపాడు, కె.ఎం.గూడెం, రెడ్డియాలపాడు నాలుగు గ్రామాలు ఉన్నాయి. ప్రతీ ఇంటికి కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల వరకు, రైతుల పొలాల్లో 5 హెచ్‌పీ మోటార్‌కు సోలార్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తున్నారు. మహిళా దినోత్సవమైన మార్చి 8న ఖమ్మంలో రెండు, భద్రాద్రిలో రెండు ప్లాంట్లకు శంకుస్థాపన చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, మధిర, కల్లూరు, పెనుబల్లి, రేలకాయలపల్లి ప్రాంతాలను, భద్రాద్రి జిల్లాలో సుజాతనగర్, బైరాగులపాడు (దుమ్ముగూడెం మండలం) ప్రాంతాలను సర్వే చేసి సెర్ప్ అధికారులకు నివేదిక పంపించారు. ఖమ్మం జిల్లాలో రెండు యూనిట్ల ఏర్పాటుకు స్థలాన్ని ఖరారు చేయాల్సి ఉంది.

ఆసక్తి పెరుగుతోంది



ఉమ్మడి జిల్లాలో సోలార్ విద్యుత్ వినియోగానికి ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటుకు పలువురు దరఖాస్తు చేస్తున్నారు. రైతులు, డెవలపర్లు, మహిళా సంఘాల వారి నుంచి అప్లికేషన్లు అందాయి. మోడల్ గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తున్నాం. వీలైనన్ని ఎక్కువ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు 63049 03919 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– పొలిశెట్టి అజయ్‌కుమార్, డీఎం, టీఎస్ రెడ్‌కో, ఖమ్మం

అందుబాటులో ప్రజాపాలన సేవా కేంద్రాలు

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి మరోసారి కులగణన సర్వేకు అవకాశం కల్పించింది. జిల్లావ్యాప్తంగా రెండోసారి కులగణన సర్వే ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు మండల కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. మొదటి విడతలో కులగణన సర్వేలో పాల్గొనని వారు ఈ కేంద్రాల ద్వారా మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఈనెల 16 నుంచి 28 వరకు కులగణన సర్వే కొనసాగనుంది. ఇందులో మూడు విధాలుగా ఇంతకు ముందు సర్వేలో పాల్గొనని వారు వివరాలు నమోదు చేసుకోవచ్చు.

- టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఎన్యూమరేటర్లను ఇంటికి పిలిపించుకునే చాన్స్ కూడా ఇచ్చారు. టోల్ ఫ్రీ నంబర్ 040 – 21111111 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాల్ చేసి నేరుగా అధికారులకు కుటుంబ వివరాలు చెప్పవచ్చు.
- మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రం వద్ద దరఖాస్తు తీసుకొని దాన్ని పూరించి అక్కడే అధికారులకు అందజేయవచ్చు.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సమర్పించవచ్చు.



చుంచుపల్లి ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకిన వ్యక్తి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి బిడ్జి పైనుంచి గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి బ్రిడ్జిపై చెప్పులు విడిచి, గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందడంతో టౌన్ ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి వరకు వ్యక్తి ఆచూకీ లభించలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పినపాక: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని దుగ్నేపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంగపేట గ్రామానికి చెందిన మాటూరి హనుమంతరావు, మునిగేల నాగేశ్వరరావు ద్విచక్రవాహనంపై జానంపేట వైపు వస్తుండగా మణుగూరు నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొన్నది. హనుమంతరావు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం..

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ల రద్దు కోసం పోరాడుదామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఉర్దుఘర్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా మొదటి మహాసభ ఆర్.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా.. నర్సయ్య మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన జరుగుతోందని, కేంద్రం, రాష్ట్ర పరిధిలోని పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు, రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు. అనంతరం మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. కార్మిక వర్గానికి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి ఎనిమిది గంటల పనిలేకుండా చేయటం సరికాదని మండిపడ్డారు. సభలో గడిపెల్లి కృష్ణప్రసాద్, గోపాల్‌రావు, పెద్దబోయిన సతీశ్, చంద్రశేఖర్, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, వేల్పుల రమేశ్, గురునాథం, కోరం శాంతయ్య, జరుపుల సుందర్, మల్సూర్, సిద్ధు, రాజేందర్‌కుమార్, భారతి, వీరన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత రైల్వేస్టేషన్ నుంచి ఉర్దూఘర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సభలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అల్లుడిపై పెట్రోలు పోసి నిప్పు..

- 14 రోజులు చికిత్స పొంది మృతి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



బల్లెం గౌతమ్ (ఫైల్)

టేకులపల్లి: భార్యాపిల్లలను చూసేందుకు అత్తారింటికి వచ్చిన అల్లుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించి, ఇంట్లోకి వెళ్లి తలుపుపెట్టుకున్నారు. మంటలకు తాళలేక ఎంతగా మొత్తుకున్నా వారు తలుపు తీయకపోవడంతో పక్కనే ఉన్న నీటితొట్టిలో దూకాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం దంతెలబోరు ఎస్సీకాలనీకి చెందిన బల్లెం చినవెంకటేశ్వర్లు పెద్ద కుమారుడు బల్లెం గౌతమ్ (23).. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఎజ్జు వెంకటేశ్వర్లు కుమార్తె కావ్యను రెండేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. సుజాతనగర్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత నెల కావ్య తన ఇద్దరు పిల్లలతో కలిసి రామచంద్రునిపేటలోని పుట్టింటికి వచ్చింది. ఈ నెల 2న రాత్రి గౌతమ్ తన పిల్లలు, భార్యను చూసేందుకు రామచంద్రునిపేటకు వచ్చాడు. గౌతమ్‌ని లోపలికి వెళ్లనీయకుండా అత్తా మామ, బావమరుదులు అడ్డుకున్నారు. దుర్భాషలాడి, దాడి చేయడంతో పాటు గౌతమ్‌పై పెట్రోలు పోసి నిప్పంటించారు. అనంతరం అందరూ లోపలికి వెళ్లి తలుపులు వేసుకున్నారు. మంటల్లో కాలుతూ ఆర్తనాదాలు చేస్తున్నా రక్షించలేదు. పక్కనే ఉన్న నీటి తొట్టిలో దూకిన గౌతమ్‌ని చుట్టు పక్కల వారు బయటకు తీసి, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం, వరంగల్ ఎంజీఎంకు తరలించారు. 14 రోజుల పాటు చికిత్స పొందిన గౌతమ్ ఆదివారం మృతి చెందాడు. బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఈ నెల 2న రామచంద్రునిపేటలో ఘటన జరిగిందని, 11న మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. కాగా, ఈ నెల 2న ఘటన జరిగి, 11న ఫిర్యాదు వచ్చినప్పటికీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని ఏలువారిగూడెం – మేడిదపల్లి గ్రామాల మధ్యలో ఎస్సారెస్పీ కాల్వ కట్టపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన కోల సైదులు (41) మేళం వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న బ్యాండ్ మేళం వాయించే పని ఉందని భార్య ఉషకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. 15న ఉదయం భార్యతో ఫోన్‌లో మాట్లాడగా ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆదివారం ఉదయం మేడిదపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువపై సైదులు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సైదులు భార్య ఉష ఘటనా స్థలానికి చేరుకుని తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కూచిపూడి జగదీశ్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు.

రెండు ఎకరాల మిర్చి కల్లం దగ్ధం



మిర్చి కుప్పపై చెలరేగుతున్న మంటలు

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండా గ్రామ పంచాయతీ ఎల్లన్ననగర్‌కు చెందిన రైతు జర్పుల రవికి చెందిన రెండు ఎకరాల మిర్చి కల్లం ఆదివారం ప్రమాదవశాత్తు పాక్షికంగా దగ్ధమైంది. చెట్టు నుంచి వేరు చేసిన కాయలను విక్రయించేందుకు అనువుగా చేసులోనే ఆరబెటి.. సాయంత్రం తిరిగి కుప్పగా చేసి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయంలో మిర్చి కుప్ప నుంచి మంటలు చెలరేగడంతో అప్రమతమతైన రవి, సమీపంలోని ఇతర రైతుల సహాయంతో నీళ్లు చల్లుతూ మంటలను ఆర్పేందుకు యత్నించాడు. కొంత మేర మిర్చిని కుప్ప నుంచి వేరుచేసి కాలిపోకుండా కాపాడుకోగలిగాడు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం జరిగిందని స్థానిక రైతులు చెబుతున్నారు. కాగా, అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

హోటల్‌లో అగ్నిప్రమాదం

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని ఓ హోటల్ (తాటిపల్లి రెసిడెన్సీ)లోని మూడో అంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగగా పలు వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం హోటల్‌లోని ఏసీ గది నుంచి మంటలు రావడంతో దట్టమైన పొగ వ్యాపించింది. 40 నిమిషాల పాటు మంటలు, పొగ ఎగిసిపడ్డాయి. పోలీసులు, ఫైర్ స్టేషన్లకు సమాచారం అందడంతో ఫైర్ అధికారులు ఫైర్‌ఇంజన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. రూ.4,90,000 ఆస్తి నష్టం వాటిల్లిందని, మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది చాలా శ్రమించాల్సి వచ్చిందని కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ గుండా పుల్లయ్య తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, హోటల్ యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.



హోటల్ నుంచి పొగ వస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన మురళి

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. జూలూరుపాడు మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన కట్రం నర్సింహారావు, ఇనగంటి మురళి ద్విచక్రవాహనంపై చంద్రుగొండకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యలో గానుగపాడు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. గాయపడిన మురళిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో బాలికకు...

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతంతో ఓ బాలికకు తీవ్ర గాయాలు కాగా, పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లికి చెందిన 13ఏళ్ల కేతా లాస్య ఆదివారం సాయంత్రం బట్టలు ఆరేసేందుకు బిల్డింగ్ పైకి వెళ్లింది. తడి బట్టలు ఆరేసే క్రమంలో 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురి కాగా, తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబీకులు బాలికను అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా, బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

జగన్నాథపురంలో చోరీ?

ములకలపల్లి: మండలంలోని జగన్నాథపురం ప్రధాన సెంటర్లోని ఓ దుకాణంలో చోరీ జరిగినట్లు సమాచారం. సదరు వ్యాపారులు ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లిన క్రమంలో ఆ ఇంట్లో దొంగతనం జరిగినట్లు తెలిసింది. ఆగంతకులు ఇంటి వెనుక తలుపు గొళ్లెం పగులగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, బంగారంతోపాటు విలువైన వస్తువులు చోరీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆదివారం సాయంత్రం చోరీ విషయాన్ని గమనించిన బాధిత కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్ర వివరాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎస్ఐ కిన్నెర రాజశేఖర్‌ను వివరణ కోరగా విచారణ చేపట్టామని తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సుజాతనగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని రాంజీతండాలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ వీరు (43) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.